క్లుప్తంగా

సీఎం కప్ క్రీడలపై కలెక్టర్ సమీక్ష



కరీమాబాద్: జిల్లా స్థాయిలో ఈనెల 22నుంచి 24వ తేదీ వరకు నిర్వహించనున్న సీఎం కప్ –2023కు సంబంధించి ఏర్పాట్లపై అధికారులతో వరంగల్ కలెక్టర్ ప్రావీణ్య శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. క్రీడాకారులకు అన్ని ఏర్పాట్లు చేపట్టాలని సూచించారు. తాగునీటి సౌకర్యం, భోజన వసతి, గాయాలపాలైతే వెంటనే చికిత్స చేసేందుకు కిట్లు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో క్రీడలను విజయవంతం చేయాలని చెప్పారు. సమావేశంలో అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకాడే, డీఈఓ వాసంతి, డీఆర్‌డీఓ సంపత్‌రావు, డీఎస్‌డీఓ విజయలక్ష్మి, డీఎంహెచ్‌ఓ డాక్టర్ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

కేయూ డీన్, బోర్డు ఆఫ్ స్టడీస్ చైర్మన్‌కు అభినందనలు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ కళాశాల డీన్‌గా ప్రొఫెసర్ అమరవేణి, బోర్డు ఆఫ్ స్టడీస్ చైర్మన్‌గా ప్రొఫెసర్ కే.రాజేందర్ బాధ్యతలు స్వీకరించారు. కాగా, వారిరువురిని అధ్యాపకులు మాదాసి కనకయ్య, సురేష్, సాయి, కిరణ్, సునీత, సోమశేఖర్, ఫణీంద్రకుమార్ శనివారం కలిసి అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

సురక్షిత ప్రాంతాలకు వలస కూలీల తరలింపు

కాజీపేట రూరల్: కాజీపేట జంక్షన్‌లో రైల్వే కాలనీ పార్కు వద్ద శుక్రవారం వలస కూలీ కుమారుడు చోటు.. కుక్కల దాడిలో మృతిచెందిన ఘటన నేపథ్యంలో రైల్వే కాలనీలో చెట్ల కింద, ప్లాట్‌ఫాం సమీపంలో నివాసం ఉంటున్న వలస కూలీలు, సంచార కుటుంబ సభ్యులను రైల్వే పోలీసులు శనివారం గుర్తించి వారి వారి గమ్యస్థానాలకు వెళ్లేలా చర్యలు తీసుకున్నారు. రైల్వే పరిధిలో తాత్కాలికంగా నివాసం ఉంటున్న వారి వివరాలు తెలుసుకొని అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సురక్షిత ప్రాంతాలకు లేదా వారు వెళ్లవలసిన ప్రాంతాలకు పంపిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

హసన్‌పర్తి: అనారోగ్య సమస్యలతో మృతిచెందిన 65వ డివిజన్ దేవన్నపేటకు చెందిన చుంచు గట్టయ్య కుటుంబాన్ని వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్ శనివారం పరామర్శించారు. ఈ సందర్భంగా మృతికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే వెంట ఆత్మ డైరెక్టర్ పంజాల భూపాల్, మాజీ సర్పంచ్ చుంచు రవిందర్, టీఆర్‌ఎస్ యూత్ నాయకుడు మైకేల్, పీఏసీఎస్ డైరెక్టర్ విజేందర్ తదితరులు ఉన్నారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు

ఖిలా వరంగల్: వరంగల్ శంభునిపేటలోని ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకుడు గుడూరు రాజేశ్వర శర్మ, ఆలయ చైర్మన్ కర్నె రవీందర్ ఆధ్వర్యంలో పూజలు, అభిషేకాలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో చేరుకుని స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులకు ఆలయ కమిటీ ప్రతినిధులు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ

ఖిలా వరంగల్: వరంగల్ ఫోర్ట్‌రోడ్డు పెరకవాడలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్‌ను ఖిలా వరంగల్ ఈద్గా అధ్యక్షుడు ఎంఏ జబ్బార్‌తో కలిసి వరంగల్ ఉర్దూ జర్నలిస్ట్ ఫెడరేషన్ ప్రతినిధులు శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు వారు మొక్క అందజేశారు. అనంతరం, ఈనెల 28న హైదరాబాద్‌లో జరగనున్న 1వ నేషనల్ కాన్ఫరెన్స్ వాల్‌పోస్టర్లను జర్నలిస్టులతో కలిసి ఎమ్మెల్యే ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంఏ.నహీమ్, మహ్మద్ సాజిద్, అక్రమ్, ఇస్మాయిల్ జకీ, అమీర్, సాధిక్ హుస్సేన్, రియాజ్, పాషా, నహీంపాషా తదితరులు పాల్గొన్నారు.

ఐకమత్యంతో ముందుకు సాగాలి



న్యూశాయంపేట: రాజకీయాలకు అతీతంగా ఐకమత్యంతో సమస్యలను పరిష్కరించుకోవాలని వరంగల్ మిల్లత్ రాబ్తా కమిటీ అధ్యక్షుడు కాజీపేట దర్గా పీఠాధిపతి ఖుస్రుపాషా పిలుపునిచ్చారు. వరంగల్‌లోని అబ్బాస్ ఫంక్షన్‌హాల్‌లో 'నేటి రాజకీయ పరిస్థితులు – ముస్లింల పాత్ర' అనే అంశంపై శుక్రవారం రాత్రి జరిగిన సదస్సులో ఆయన మాట్లాడారు. ముస్లింలు విద్యలో, ఆర్థిక, సామాజిక, రాజకీయాల్లో ముందుండాలని సూచించారు. ఐక్యమత్యంతో ముందుకు సాగితే అన్ని సమస్యలు పరిష్కరించుకోవచ్చని ఎంఐఎఫ్ కన్వీనర్ డాక్టర్ అనీస్ సిద్దిఖీ అన్నారు. సమావేశంలో సయ్యద్ మసూద్, నయీం, అబ్దుల్ ఖుద్దూస్, ముఫ్తీ మీనాజ్, డాక్టర్ వలీవుల్లా ఖాద్రీ, అయూబ్‌ఖాన్, యూసుఫ్ ఖాలిద్‌సయిద్, అతీఖుర్ రహమాన్, అజీజుల్లా బేగ్, అబ్దుల్ ఖార్, ఎంఏ.తన్వీర్ పాల్గొన్నారు.

ఇదేనా స్వచ్ఛత?

కార్పొరేషన్ కార్యాలయం అస్తవ్యస్తం



కార్పొరేషన్ కార్యాలయంలో గుట్కా మరకలు

నగరంలో బల్దియా కార్యాలయం నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. భవనంపై పాడైపోయిన ట్యాంకులతో నీరు ఎక్కడికక్కడ నిలిచి ఉంటోంది. చెట్లు, చెత్తాచెదారంతో నిండిపోతోంది. కార్యాలయం గోడలపై గుట్కా, పాన్ మరకలు దర్శనమిస్తున్నాయి. ఇక, ఫైళ్లు అయితే చెత్తకుప్పలా దర్శనమిస్తున్నాయి. పాడైపోయిన సామగ్రిని ఎక్కడపడితే అక్కడ వేయడంతో తుప్పు పట్టిపోతోంది. రోజూ అధికారులు, పాలకవర్గం చూస్తున్నా పట్టించుకోని దుస్థితి. నగరంలో స్వచ్ఛత దేవుడెరుగు.. కనీసం కార్యాలయంలోనైనా పాటించడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, వరంగల్



ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ ఫ్యూజ్‌లు



హాల్ బయట పడేసిన ఫైళ్లు



కార్పొరేషన్ కార్యాలయంపై చెత్త, మొలిచిన చెట్లు



కార్యాలయంపైన పాడైపోయిన ట్యాంకులు



ఉన్నతాధికారుల రూం పక్కనే పాడైపోయిన సామగ్రి

సీఎం కేసీఆర్‌ను కలిసిన చీఫ్‌విప్



సీఎంకు వినతి పత్రం అందిస్తున్న చీఫ్‌విప్

హన్మకొండ: సీఎం కేసీఆర్‌ను రాష్ట్ర ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్ హైదరాబాద్‌లో శనివారం కలిశారు. ఈ సందర్భంగా చెరువు శిఖం, ఎఫ్‌టీఎల్ భూముల్లో నివాసముంటున్న నిరుపేదలకు జీఓ నంబర్ 58 ద్వారా పట్టాలు ఇవ్వాలని కోరుతూ వినతి పత్రం అందించారు. అనేక ఏళ్లుగా తమ నివాస స్థలాలకు హక్కులు కల్పించాలని ఎదురుచూస్తున్న పేదలకు జీఓ నంబర్లు 58, 59 ద్వారా పట్టాలు అందిస్తున్నందుకు కేసీఆర్‌కు వినయ్‌భాస్కర్ కృతజ్ఞతలు తెలిపారు.

ప్రభుత్వం ఆదుకోవాలి

న్యూశాయంపేట: అకాల వర్షంతో నష్టపోయిన కుటుంబాలకు ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలని బీజేపీ సోషల్ మీడియా కన్వీనర్ ఆడెపు వెంకటేశ్ డిమాండ్ చేశారు. నష్టపోయిన కుటుంబాల ఆర్థిక స్థితిగతులను అధికారులు అంచనా వేసి ప్రభుత్వానికి నివేదించాలని సూచించారు.

అధికారుల అలసత్వమే కారణం



సమావేశంలో మాట్లాడుతున్న రత్నమాల

కాశిబుగ్గ: కాజీపేట రైల్వేకాలనీ చిల్డ్రన్ పార్క్ వద్ద శుక్రవారం జరిగిన కుక్కల దాడిలో బాలుడి మృతికి అధికారుల అలసత్వమే కారణమని సీపీఎం నాయకురాలు నలిగంటి రత్నమాల ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏసిరెడ్డినగర్‌లోని పార్టీ కార్యాలయంలో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిస్థితి పేరు గొప్ప.. ఊరు దిబ్బలా ఉందని ఎద్దేవాచేశారు. నగరంలో అన్ని చోట్ల కోతులు, కుక్కలు, పందులు గుంపులుగా తిరుగుతూ ప్రజలపై దాడులకు పాల్పడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. వాటిని నియంత్రించడంతో మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు విఫలమవుతున్నారని విమర్శించారు. సమావేశంలో సీపీఎం నాయకులు దుర్గయ్య, మహేందర్, సారంగపాణి, ఉదయ్, ఎల్లయ్య, రాధక్క తదితరులు పాల్గొన్నారు.

రైలు ఢీకొని వ్యక్తి దుర్మరణం



రాజు (ఫైల్)

కాశిబుగ్గ: గుర్తు తెలియని రైలు ఢీకొని ఓ వ్యక్తి దుర్మరణం చెందిన ఘటన చింతలపల్లి, వరంగల్ రైల్వే స్టేషన్ల మధ్య ధర్మారం గేటు సమీపంలో శనివారం ఉదయం చోటుచేసుకుంది. జీఆర్పీ సీఐ నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్ జిల్లా గీసుకొండ మండలం ధర్మారానికి చెందిన గోపు రాజు(41) మేస్త్రీ పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈక్రమంలో శనివారం ఉదయం బహిర్భూమికి ధర్మారం గేటు సమీపంలో రైలు పట్టాలు దాటి తిరిగి వస్తుండగా అప్‌లైన్‌లో వెళ్లే గుర్తు తెలియని రైలు ఢీ కొట్టింది. దీంతో రాజు అక్కడికక్కడే మృతి చెందాడు. డిప్యూటీ ఎస్‌ఎస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించామని సీఐ తెలిపారు.

సామాజిక సేవలో భాగస్వాములు కావాలి



మాట్లాడుతున్న ఈసం నారాయణ

కేయూ క్యాంపస్: సామాజిక సేవాదృక్పథంతో ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు సామాజిక సేవలో భాగస్వాములు కావాలని కాకతీయ యూనివర్సిటీ జాతీయ సేవాపథకం (ఎన్‌ఎస్‌ఎస్) ప్రొఫెసర్ ఈసం నారాయణ కోరారు. హనుమకొండలోని కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ –1 ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఎం.రాంబాబు ఆధ్వర్యంలో కాకతీయ యూనివర్సిటీలో ఏడు రోజులపాటు కొనసాగనున్న ఎన్‌ఎస్‌ఎస్ ప్రత్యేక శిబిరాన్ని ఈసం నారాయణ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్‌ఎస్‌ఎస్ కార్యక్రమాల్లో పాల్గొనడం ద్వారా వలంటీర్లలో వ్యక్తిత్వ వికాసం పెంపొందుతుందని వివరించారు. అనంతరం, క్యాంపస్‌లోని మహిళా హాస్టల్ వద్ద వలంటీర్లు శ్రమదానం చేశారు. కార్యక్రమంలో కేడీసీ ప్రిన్సిపాల్ డాక్టర్ రాజిరెడ్డి, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ రాంబాబు, సీనియర్ వలంటీర్లు రత్నాకర్, ప్రదీప్, వివేక్, యాకూబ్, ఇమ్రాన్, సమీక్ష, లక్ష్మి, సోనాలి, సంతోషిని, భారతి, నమిత పాల్గొన్నారు. కేయూకు న్యాక్ టీం రానున్న నేపథ్యంలో పలుచోట్ల పరిసరాలను శుభ్రం చేసేలా ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్ల సేవలను వినియోగించుకుంటున్నారు. వారితో శ్రమదానం చేయిస్తున్నారు.

కేయూ కాంట్రాక్టు అధ్యాపకుల ధర్నా



ధర్నా చేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులు

కేయూ క్యాంపస్: తెలంగాణ రాష్ట్రంలో 12 యూనివర్సిటీల్లోని కాంట్రాక్టు అధ్యాపకులను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ కాంట్రాక్టు అధ్యాపకుల సంఘం (కుక్టా) ఆధ్వర్యంలో కాకతీయ యూనివర్సిటీలోని ఇంజనీరింగ్ కళాశాల (కో ఎడ్యుకేషన్) వద్ద శనివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కుక్టా అధ్యక్షుడు డాక్టర్ శ్రీధర్‌కుమార్ లోథ్ మాట్లాడుతూ తెలంగాణలోని అన్ని యూనివర్సిటీల్లో పనిచేస్తున్న 1,335 మంది కాంట్రాక్టు లెక్చరర్లను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కుక్టా జనరల్ సెక్రటరీ ఆర్‌డీ.ప్రసాద్, బాధ్యులు చందులాల్, నాగయ్య, రమేష్, అనిల్‌కుమార్, సంగీత్‌కుమార్, కల్పన, స్వప్న, మంజుల, లక్ష్మణ్‌నాయక్, సంతోష్, రామచందర్, వాణి, యశ్వేందర్, విజయ్, శ్రీధర్‌కుమార్ భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పేకాట శిబిరంపై దాడులు



సంఘటన స్థలంలో టాస్క్‌ఫోర్స్ సిబ్బంది, పోలీసులు

హసన్‌పర్తి: కాకతీయ యూనివర్సిటీ పోలీస్‌స్టేషన్ పరిధి యాదవనగర్‌లోని ఓ పేకాట శిబిరంపై టాస్క్‌ఫోర్స్ బృందం శనివారం దాడులు నిర్వహించింది. నలుగురిని అదుపులోకి తీసుకోగా, మరో నలుగురు పరారైనట్లు, నిందితుల నుంచి రూ.7,040 నగదుతో పాటు ఐదు సెల్‌ఫోన్లు, బైక్ స్వాధీనం చేసుకున్నట్లు, టాస్క్‌ఫోర్స్ ఏసీపీ జితేందర్‌రెడ్డి తెలిపారు. యాదవనగర్‌లోని ఓ కేంద్రంలో పేకాట ఆడుతున్నారనే పక్కా సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ బృందం దాడులు నిర్వహించింది. ఈ సందర్భంగా పేకాట ఆడుతున్న ఏనుగులగడ్డకు చెందిన మూల శ్రీధర్, హనుమకొండ సుధానగర్‌కు చెందిన సిద్దపటి శ్రీనివాస్, హనుమకొండకు చెందిన కిమిడి నీలం, కుమార్‌పల్లికి చెందిన సాంబార పోచాలును అదుపులోకి తీసుకున్నారు. హనుమకొండకు చెందిన మహేందర్, రాయపురకు చెందిన పున్నంచందర్, రాచర్ల శ్రీను, గుర్రాల శ్రీకాంత్ పరారైనట్లు ఏసీపీ వివరించారు. దాడుల్లో ఇన్‌స్పెక్టర్లు కె.శ్రీనివాస్, జనార్దన్‌రెడ్డి, ఎస్సైలు లవన్‌కుమార్, శరత్, ఎస్సై రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి పథకం.. ఓ వరం



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే రమేష్, తదితరులు

మడికొండ: పేదింటి ఆడపిల్లల తల్లిదండ్రులకు కల్యాణలక్ష్మి పథకం ఓ వరంలాంటిదని వర్ధన్నపేట ఎమ్మెల్యే, టీఆర్‌ఎస్ పార్టీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు అరూరి రమేష్ అన్నారు. 46, 64వ డివిజన్లకు చెందిన 13మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను శనివారం పంపిణీ చేశారు. ఈమేరకు లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశంలో ఎక్కడాలేని అనేక సంక్షేమ పథకాలను సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టి అమలు చేస్తున్నారని వివరించారు. కార్యక్రమంలో 46, 64వ డివిజన్ల కార్పొరేటర్లు మునిగాల సరోజన, ఆవాల రాధిక రెడ్డి, డివిజన్ల అధ్యక్షులు బొల్లికొండ వినోద్, దువ్వ శ్రీకాంత్, అల్లం శ్రీనివాస్, కుందురు రాజేష్‌రెడ్డి, గాండ్ల భిక్షపతి, దువ్వ నవీన్, బుర్ర రాజన్‌బాబు, పోలెపల్లి రాంమూర్తి, వెన్నమల్ల రమేష్, ఓర్సు రాజు, కరుణాకర్, వల్లెపు ఉపేందర్, కుమార్‌రాజు, తదితరులు పాల్గొన్నారు.

దళితుల హక్కులను కాపాడుకుందాం



సమావేశంలో మాట్లాడుతున్న ఎలేందర్

ఖిలా వరంగల్: దళితుల హక్కులను కాపాడుకుందామని దళిత హక్కుల పోరాట సమితి (డీహెచ్‌పీఎస్) జిల్లా అధ్యక్షుడు సంగి ఎలేందర్, సభ్యుడు గన్నారపు రమేష్ పిలుపునిచ్చారు. ఈమేరకు వరంగల్ శివనగర్‌లోని సీపీఐ తమ్మెర భవనంలో తాళ్లపల్లి జాన్‌పాల్, సుధీర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. దళిత సమస్యలపై కలిసి పోరాడుదామని సూచించారు. అనంతరం మండల కమిటీని ఏకగ్రీవంగా ఎనుకున్నారు. అధ్యక్షుడిగా రాజు, కార్యదర్శిగా రాజేందర్, వరంగల్ మండల అధ్యక్షుడిగా దేవరాజ్, కార్యదర్శిగా శంకర్ ఎన్నికయ్యారని వెల్లడించారు.

సీపీఎం నేతలపై కేసు నమోదు

ఖిలా వరంగల్: వరంగల్ శంభునిపేటలోని ఆర్‌ఆర్ గార్డెన్‌లో అనుమతి లేకుండా సీపీఎం నేతలు పుచ్చలపల్లి సుందరయ్య సంతాప సభను శుక్రవారం నిర్వహించటమే కాకుండా రోడ్డుపై వాహనాలు పార్కు చేశారు. ఈ క్రమంలో రాకపోకలకు తీవ్ర అంతరాయం కల్పించారని సీపీఎం నేతలు మాలోతు సాగర్, జిల్లా అధ్యక్షుడు రంగయ్య, పలువురు నాయకులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సాంబయ్య శనివారం తెలిపారు.

బీఆర్‌ఎస్ నాయకుల ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న మధుసూదనాచారి

వరంగల్ చౌరస్తా: వరంగల్ తూర్పు నియోజకవర్గంలోని బీఆర్‌ఎస్ 13, 20, 21, 26వ డివిజన్ల నాయకులు, కార్యకర్తల సమ్మేళనం కాశిబుగ్గ వివేకానంద కళాశాల ఆవరణలో శనివారం రాత్రి జరిగింది. ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ అధ్యక్షతన జరిగిన సమావేశానికి ముఖ్యఅతిథిగా మాజీ స్పీకర్, ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి, ఆర్‌అండ్‌బీ చైర్మన్ మెట్టు శ్రీనివాస్ హాజరై మాట్లాడారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధిని వివరించారు. సమావేశంలో స్థానిక కార్పొరేటర్లు సురేష్ జోషి, గుండేటి నరేంద్ర కుమార్, ఫరూఖ్ ఖాన్, బాల్నె సురేష్, బీఆర్‌ఎస్ నాయకులు బయ్య స్వామి, రాజేంద్రచారి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పేదల భూములకు పట్టాలివ్వాలి



తహసీల్దార్ రాజ్‌కుమార్‌కు వినతిపత్రం ఇస్తున్న సీపీఎం నాయకులు

హన్మకొండ అర్బన్: హనుమకొండ మండలంలోని గోపాలపూర్, సమ్మయ్యనగర్, ఇంజనీర్స్‌కాలనీ, వాంబేకాలనీలలో నివాసం ఉంటున్న పేదలకు జీఓ నంబర్ 58ప్రకారం ప్రభుత్వం పట్టాలు ఇవ్వాలని సీపీఎం నాయకులు కోరారు. ఈమేరకు హనుమకొండ తహసీల్దార్ కార్యాలయం ఎదుట శనివారం ధర్నా చేశారు. అనంతరం తహసీల్దార్ గనిపాక రాజ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. నాయకులు చుక్కయ్య, ఉప్పలయ్య, వీరన్న ఉన్నారు.

రెడ్యూస్, రీయూజ్, రీసైకిల్‌పై అవగాహన



హన్మకొండ చౌరస్తా: మాట్లాడుతున్న కార్పొరేటర్ వెంకటేశ్వర్లు

మడికొండ: మేరీ లైఫ్.. మేరా స్వచ్ఛ షెహర్‌లో భాగంగా ట్రిపుల్ ఆర్ (రెడ్యూస్, రీయూజ్, రీసైకిల్)పై నగర ప్రజలకు స్థానిక ప్రజాప్రతినిధులు అవగాహన కల్పించారు. ఇళ్లలోని పనికిరాని వస్తువులు, సామగ్రిని ట్రిపుల్ ఆర్ సెంటర్లకు అందజేయాలని శనివారం ర్యాలీలు నిర్వహించారు. 46వ డివిజన్ మడికొండలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మునిగాల సరోజన మాట్లాడుతూ ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని (జూన్ –5) పురస్కరించుకొని కేంద్ర పట్టణాభివృద్ధి, గృహ నిర్మాణ మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో జీడబ్ల్యూఎంసీ కమిషనర్ ఆదేశాల మేరకు స్వచ్ఛ భారత్ మిషన్ ఆధ్వర్యంలో చేపట్టిన ట్రిపుల్ ఆర్ కార్యక్రమంలో ప్రజలను భాగస్వాములను చేయాలనే లక్ష్యంతో అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నట్లు వివరించారు. ఇతరులకు ఉపయోగపడే పాత దుస్తులు, బొమ్మలు, ప్లాస్టిక్ వస్తువులు, పుస్తకాలు, పాత సామగ్రి, ఇతర వస్తువులను సేకరిస్తున్నట్లు తెలిపారు. సేకరించిన వస్తువులను టిపుల్ ఆర్ సెంటర్లకు తరలించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు బొల్లికొండ వినోద్, గాండ్ల భిక్షపతి, మాచర్ల విజయ్, కొలిపాక కుమార్, పల్లపు కుమార్‌రాజ్, మునిగాల శ్రీకాంత్, కరుణాకర్, యాదయ్య, హెల్త్ ఆఫీసర్లు, మున్సిపల్ సిబ్బంది, మహిళా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

పడమరకోటలో ట్రిపుల్ ఆర్ కేంద్రం ప్రారంభం

ఖిలా వరంగల్: వరంగల్ 38వ డివిజన్ పడమరకోటలో మహా నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మేరీ లైఫ్.. మేరా స్వచ్ఛ షెహర్ (రెడ్యూస్, రీయూజ్, రీసైకిల్) ట్రిపుల్ ఆర్ కేందాన్ని కార్పొరేటర్ బైరబోయిన ఉమ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇళ్లల్లోని వాడబడిన పనికిరాని వస్తువులు, ప్లాస్టిక్ కవర్లు, పుస్తకాలు, పాదరక్షలు, వినియోగంలేని దుస్తువులు, గాజులను ట్రిపుల్ ఆర్ కేంద్రానికి అందజేయాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో బైరబోయిన దామోదర్ యాదవ్, ఆర్పీలు, పారిశుద్ధ్య సిబ్బంది పాల్గొన్నారు.

40వ డివిజన్‌లో..

కరీమాబాద్: ఇళ్లలోని పనికిరాని వస్తువులను అప్పగించేందుకు ఏర్పాటు చేసిన ట్రిపుల్ ఆర్ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని 40వ డివిజన్ కార్పొరేటర్ మరుపల్ల రవి సూచించారు. డివిజన్ పరిధిలోని కరీమాబాద్ రామస్వామి దేవాలయం ప్రాంతంలోని ఇళ్లలో అక్కరకు రాని వస్తువులను శనివారం సేకరించారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ నిరుపయోగంగా ఉన్న వస్తువులు, బట్టలు, ప్లాస్టిక్, ఇనుప సామాను, ఇతర సామగ్రిని ఆర్పీలకు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంకన్న, సీఓ సునీత, కుమార్, కృష్ణ, లక్ష్మికాంత్, సుమలత, స్పందన, ఆర్పీలు, ఓబీలు, జవాన్లు పాల్గొన్నారు.

61వ డివిజన్‌లో..

కాజీపేట: పర్యావరణానికి ప్రజలు విఘాతం కలిగించొద్దని, పర్యావరణ పరిరక్షణకు ప్రతీఒక్కరు సహకరించాలని కార్పొరేటర్ ఎలకంటి రాములు కోరారు. కాజీపేట 61వ డివిజన్ సిద్దార్థనగర్ కాలనీ ప్రభుత్వ కమ్యూనిటీ హాల్‌లో మేరీ లైఫ్, మేరా స్వచ్ఛ షెహర్ కార్యక్రమాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో మీడియా ఇన్‌చార్జ్ కోరబోయిన శ్రావణ్‌కుమార్, అఫ్జల్, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

10వ డివిజన్‌లో..

హన్మకొండ చౌరస్తా: ఇంట్లో మూలకు పడేసిన వ్యర్థాలను ప్రజలు.. మున్సిపల్ వాహనదారులకు అందించాలని 10వ డివిజన్ కార్పొరేటర్ తోట వెంకటేశ్వర్లు సూచించారు. పనికిరాని వస్తువులను ట్రిపుల్ ఆర్ కేంద్రాలకు అందించేందుకు ప్రజలు సహకరించాలని కోరారు. ఈమేరకు ట్రిపుల్ ఆర్ కార్యక్రమంపై డివిజన్‌లోని మచిలీబజార్, ఉజిలీబేస్ ప్రాంతాల ప్రజలకు శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల్లో చైతన్యం కల్పించే కార్యక్రమాలపై మున్సిపల్ అధికారులు సహకరించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ 10వ డివిజన్ అధ్యక్షుడు కుమార్ యాదవ్, మున్సిపల్ జవాన్లు రమేష్, శ్రీనివాస్, ఎల్లస్వామి, దేవేందర్, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

అంతిమ సంస్కారాలకు ఆర్థిక సాయం



కాశిబుగ్గ: వరంగల్ కాశిబుగ్గ ప్రాంతానికి చెందిన ద్విచక్రవాహన మెకానిక్ ఎ.రవికుమార్(42) అనారోగ్యానికి గురై ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. మృతుడికి భార్య లావణ్య, ముగ్గురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. కాగా, రవికుమార్ మృతదేహాన్ని బైక్ మెకానిక్‌లు ఆడెపు అనిల్, బండారి ప్రభాకర్, రాయి ప్రభాకర్, జగన్, హాజీ, రమేష్‌తో కలిసి ఆల్ టూవీలర్స్ మెకానిక్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎండీ.జాఫర్ సందర్శించారు. దహన సంస్కారాల నిమిత్తం మృతుడి భార్య లావణ్యకు రూ.13వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు.